సాక్షి ఖమ్మం

గురువారం । 6 । జూన్ । 2024



ముందస్తుగా సిద్ధం

రానున్న సీజన్‌లో ఈదురుగాలులు, వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా 'ప్రీ మాన్సూన్' పేరిట డ్రైవ్ నిర్వహిస్తున్నారు. 8లో



బిర్యానీలో బొద్దింక ఎక్స్‌ట్రా!

ఖమ్మంలోని ఓ రెస్టారెంట్‌లో బిర్యానీ తీసుకుంటే బొద్దింక రాగా ప్రశ్నిస్తే 'ఇంట్లో పిల్లలం చేస్తే రాదా' అని నిర్వాహకులు బదులిచ్చిన ఘటన ఇది. 8లో

గరిష్టం / కనిష్టం 37° / 27°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల వాతావరణం చల్లబడి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'బడిబాట'

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ ఆధ్వర్యాన గురువారం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేశారు. తొలిరోజైన గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తారు. ఇదేరోజు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించడమే కాక గ్రామ మహిళా సమాఖ్యల సమావేశం ఏర్పాటుచేసి బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేరుస్తామని ప్రతిజ్ఞ చేయిస్తారు. రెండో రోజు పాఠశాలకు వెళ్తున్న చిన్నారుల జాబితాను గ్రామ విద్యా రిజిస్టర్‌లో పొందుపరుస్తారు. ఇక 8వ తేదీ నుంచి గతంలో విడుదల చేసిన షెడ్యూల్ ఆధారంగా పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్ల ద్వారా తల్లిదండ్రులకు కలిసి ప్రభుత్వ ఉన్నత వసతులను వివరించి ప్రవేశాల సంఖ్య పెంపునకు పాటుపడాల్సి ఉంటుంది. అంతేకాక ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులను భవిత కేంద్రాల్లో చేర్పించాలి. మిగతా రోజుల్లో షెడ్యూల్ ఆధారంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ విజయవంతం చేసేలా ప్రణాళిక రూపొందించామని డీఈఓ సోమశేఖరశర్మ, సీఎంఓ రాజశేఖర్ వెల్లడించారు.

జనరల్ ఆస్పత్రి ఆర్‌ఎంఓగా వినాయక్



ప్రిన్సిపాల్ నుండి నియామకపత్రం అందుకుంటున్న వినాయక్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జ్ ఆర్‌ఎంఓగా ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాథోడ్ వినాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు నియామక త్రాన్ని అందజేశారు. పెద్దాస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పాటుకావటంతో ఆర్‌ఎంఓల ఆవశ్యకత పెరిగింది. వివిధ విభాగాలను పర్యవేక్షించేందుకు సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్ అర్హతతో రెండు ఆర్‌ఎంఓ పోస్టులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ అర్హతతో నాలుగు పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా వినాయక్ నియామకంతో ఆర్‌ఎంఓల సంఖ్య మూడుకు చేరింది.

డయల్ 100కు 4,547 ఫోన్లు

ఖమ్మంక్రైం: అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని చేయూతనిచ్చేందుకు ఏర్పాటుచేసిన డయల్ 100కు గడిచిన మే నెలలో 4,547 మంది ఫోన్ చేశారని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వెల్లడించారు. ఇందులో 100 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీటిలో మహిళలపై వేధింపులు, దొంగతనాలు, రోడ్డుప్రమాదాలు, అనుమానాస్పద మరణాలతో పాటు ఇతర కేసులు ఉన్నాయని సీపీ తెలిపారు.

నూరు శాతం వ్యాక్సినేషన్

సత్తుపల్లిటౌన్: చిన్నారులను ఏడు రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించేందుకు నూరు శాతం టీకాలు వేయాలని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్‌వీ. రమణ సూచించారు. సత్తుపల్లి ఏరియా ఆస్పత్రి, గంగారం పీహెచ్‌సీల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించాక మేనేజర్ మాట్లాడుతూ టీకాలు వేసిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించడంతో పాటు వ్యాక్సిన్ల నిల్వపై సూచనలు చేశారు. అనంతరం ఆయన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీతారాంను కలవగా, గంగారం పీహెచ్‌సీ వైద్యులు అవినాష్, ఉద్యోగులు శ్రీనివాస్, సత్యనారాయణ, పద్మ, మంజుల పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పార్క్‌లో మొక్క నాటుతున్న డీఎఫ్ఓ, తదితరులు

ఖమ్మంఅర్బన్: ప్రతీఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణ మనుగడ సాధ్యమవుతుందని జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ తెలిపారు. అంతేకాకుండా ప్లాస్టిక్ నిషేధంపైనా దృష్టి సారించాలని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఖమ్మంలోని వెలుగుమట్ల పార్క్‌లో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాక పట్టణ ప్రాంతాల్లో సైతం ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం, సంరక్షించడాన్ని అందరూ బాధ్యతగా తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ బెల్లం రాధిక, డీఆర్ఓ లక్ష్మీపతి, ఎఫ్ఎస్ఓ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

హస్తం అప్రతిహతం

ఉమ్మడి ఖమ్మంలో కాంగ్రెస్ 'షో'

- లోక్‌సభ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికలకు మించి ఓట్లు
- ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 9,80,507 ఓట్లు
- పార్లమెంట్ ఎన్నికల్లో మరో 10వేల పైచిలుకు అదనం
- గణనీయంగా పడిపోయిన బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అప్రతిహత విజయాలు నమోదు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షంతో కలిపి తొమ్మిది స్థానాల్లో విజయఢంకా మోగించిన ఆ పార్టీ.. లోక్‌సభ ఎన్నికల్లోనూ హవా కొనసాగించింది. మొత్తం పది నియోజకవర్గాల్లో 9,90,953 ఓట్లు కొల్లగొట్టడంతో తిరుగులేని శక్తిగా ఎదిగినట్టయింది. అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం తొమ్మిది(భద్రాచలం మినహా) నియోజకవర్గాల్లో 3,41,235 ఓట్ల మెజార్టీ సాధించగా.. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలోని పది నియోజకవర్గాల్లో 6,10,696 ఓట్ల మెజార్టీ సాధించడం విశేషం. దీంతో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల్లో జోష్ నెలకొనగా.. రెండు ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ ఓటు బ్యాంక్ గణనీయంగా తగ్గడం గమనార్హం.

ఒడిదుడుకులను ఎదుర్కొని..

కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆది నుంచి అండగా ఉంటూ వస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ గెలుస్తున్నా, లోక్‌సభలో మాత్రం గత 15 ఏళ్లుగా మూడు పర్యాయాలు ఓటమి ఎదురైంది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారు పార్టీ ఫిరాయించడంతో ఇబ్బందులు ఎదుర్కొంది. అయితే క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, బలమైన ఓటు బ్యాంక్ కొనసాగడంతో ఏ ఎన్నికల్లోనైనా సత్తా చాటడం ఆనవాయితీగా వస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ బలం మరింత పెరిగింది. 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో సత్తా చాటి ఉమ్మడి జిల్లాలోని పది స్థానాలకు గాను మిత్రపక్షమైన సీపీఐతో కలిసి తొమ్మిదింట విజయకేతనం ఎగురవేసింది. ఆపై భద్రాచలంలో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన తెల్లం వెంకట్రావు సైతం కాంగ్రెస్ గూటికి చేరడంతో పది స్థానాలు కాంగ్రెస్ వశమైనట్టయింది.

లోక్‌సభ ఎన్నికల్లో రికార్డు

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి రికార్డు స్థాయి మెజార్టీ సాధించారు. ఖమ్మం లోక్‌సభ పరిధిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సందర్భంగా రఘురాంరెడ్డి 4,67,847 ఓట్ల మెజార్టీతో విజయదుందుభి మోగించగా.. అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. అలాగే, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని భద్రాచలం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌కు మెజార్టీ ఓట్లు వచ్చాయి. దీంతో రెండు పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. 1952లో ఖమ్మం లోక్‌సభ స్థానం ఏర్పడగా, ఇప్పటి వరకు రఘురాంరెడ్డి సాధించిన 4,67,847 ఓట్ల మెజార్టీనే అత్యధికం.

మెజార్టీ 6.10 లక్షలు

తాజాగా వెల్లడైన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6,10,696 ఓట్ల మెజార్టీ సాధించింది. ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4,67,847 ఓట్లు, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని భద్రాచలం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల్లో 1,42,849 ఓట్ల మెజార్టీ వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మొత్తం పది నియోజకవర్గాల్లో 9,80,507 ఓట్లు రాగా.. ఇప్పుడు 9,90,953 ఓట్లు సాధించడం విశేషం. దీంతో రెండు ఎన్నికల్లో ఆ పార్టీ తిరుగులేని మెజార్టీ సాధించడంతో శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

బీజేపీ.. మూడోస్థానంతోనే సరి

పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ చరిష్మాతో ఓట్లు కొల్లగొడతామనుకున్న బీజేపీ నమ్మకం కూడా ఫలించలేదు. రౌండ్ రౌండ్‌కూ ఓట్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కేవలం 1,18,636 ఓట్లు మాత్రమే సాధించారు. మహబూబాబాద్ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ సైతం మూడోస్థానంతో సరిపెట్టుకున్నారు.

బీఆర్‌ఎస్ కుదేలు

అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ కుదేలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కేవలం భద్రాచలంలో మాత్రమే విజయం దక్కింది. అయినా పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని, కాంగ్రెస్‌పై మొదలైన వ్యతిరేకత ఓట్ల రూపంలో తమకు కలిసొస్తుందని బీఆర్‌ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. కానీ అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ ఎక్కువ ఓట్లు సాధించడంతో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పలేదు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు శాసనసభ ఎన్నికల్లో 6,28,757 ఓట్లు పోల్ కాగా.. పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి కేవలం 3,80,257 ఓట్లే సాధించడం ఆ పార్టీ శ్రేణులకు మింగుడు పడడం లేదు.

గ్రూప్–1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: గ్రూప్– 1 ప్రిలిమినరీ పరీక్ష ఈనెల 9వ తేదీన జరగనుండగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులతో సమావేశమై మాట్లాడారు. ఈనెల 9న ఉదయం 10–30నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, జిల్లాలో 18,403 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 52 కేంద్రాలను ఏర్పాటు చేశామని, తెలిపారు. పరీక్షకు ఒకరోజు ముందే అధికారులు రూట్లు సరిచేసుకోవాలని చెప్పారు. ఇక కేంద్రాల్లో ప్రతీ అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మహిళలను పరిశీలించేందుకు మహిళా సిబ్బందిని నియమించడంతో పాటు ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రం ప్రవేశద్వారం, చీఫ్ సూపరింటెండెంట్ గది, ఒక హాల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుచేయాలని చెప్పారు. కాగా, అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయనున్నందున ఉదయం 9గంటలకల్లా కేంద్రాలకు చేరుకోవాలని, 10 గంటల తర్వాత వచ్చేవారికి అనుమతి ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. కాగా, 13 ఫ్లయింగ్ స్క్వాడ్, 52మంది శాఖాధికారులు, 184 మంది గుర్తింపు అధికారులను నియమించామని తెలి పారు. ఇన్విజిలేటర్లకు హాళ్ల కేటాయింపు పరీక్ష రోజు ఉదయం 9–30 గంటలకు లాటరీ ద్వారా చేపట్టాలని, ఇన్విజిలేటర్ల బంధువులెవరూ ఆ కేంద్రంలో పరీక్ష రాయడం లేదని ధ్రువీకరణ తీసుకోవాలని సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్‌బీఐటీ, విజయ ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ జి.రాజ్‌కుమార్, డాక్టర్ జాన్ బాబు, కలెక్టరేట్ ఏఓ అరుణ పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌కు వేస్తున్న తాళాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

కలెక్టరేట్‌లోని గోదాంకు ఈవీఎంలు

ఖమ్మం లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయిన నేపథ్యాన ఈవీఎంలు, ఇతర సామగ్రిని కలెక్టరేట్ ఆవరణలోని గోదాంలో భద్రపర్చారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షాన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లను భద్రపరిచి కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యాన సీజ్ చేశారు. అనంతరం జిల్లా ఖజానాశాఖ స్ట్రాంగ్ రూంలో భద్రపర్చిన ఇతర సామగ్రిని పరిశీలించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్‌డీసీ రాజేశ్వరి, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సీహెచ్.స్వామి, రాంప్రసాద్, ఉద్యోగులు మదన్ గోపాల్, రాళ్లబండి రాంబాబు వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పట్టభద్రుల' ఓట్ల లెక్కింపు



బ్యాలెట్ పేపర్లను బండిళ్లు కడుతున్న ఉద్యోగులు



బ్యాలెట్ పేపర్ చూపిస్తున్న ఉద్యోగి

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి కౌంటింగ్ బుధవారం నల్లగొండలో ప్రారంభమైంది. గత నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ జరగగా, 52 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్‌ఎస్ నుంచి రాకేష్‌రెడ్డి, బీజేపీ నుంచి తలపడిన ప్రేమేందర్ రెడ్డి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

లెక్కింపు ఇలా...

ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌లోని బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తీసుకొచ్చి 25 బ్యాలెట్ పేపర్ల చొప్పున బండిళ్లు కట్టారు. ఈ ప్రక్రియ సాయంత్రం 4 గంటలకు పూర్తయ్యాక మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. ఈ ఫలితం గురువారం ఉదయం వరకు వెలువడే అవకాశముంది. ఓట్లను 96 టేబుళ్లపై టేబుల్‌కు వెయ్యి ఓట్ల చొప్పున ఒక్కో రౌండ్‌లో 96 వేల చొప్పున లెక్కిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు నాలుగు రౌండ్లలో పూర్తికానుండగా.. పోలైన 3,36,013 ఓట్లను మూడు రౌండ్లలో టేబుల్‌కు వెయ్యి ఓట్ల చొప్పున, 4వ రౌండ్‌లో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున లెక్కిస్తారు. ఈమేరకు గురువారం ఉదయం వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కింపు పూర్తయ్యాక చెల్లని ఓట్లను తీసేసి చెల్లిన ఓట్లలో సగానికి ఒక ఓటు కలుపుతూ గెలుపు లక్ష్యాన్ని నిర్ణయిస్తారు. ఆ లక్ష్యం ప్రకారం మొదటి ప్రాధాన్యత కౌంటింగ్‌లో ఏ అభ్యర్థికైనా మెజార్టీ వస్తే విజేతగా ప్రకటిస్తారు. లేదంటే ఎలిమినేషన్ పద్ధతిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించాల్సి ఉండడంతో ఈ ప్రక్రియ గురువారం రాత్రి వరకు కొనసాగే అవకాశముంది.

మిగులు.. దిగులు

సింగరేణిలో కార్మికులు ఎక్కువ.. ఉత్పత్తి తక్కువ

- మూత పడుతున్న భూగర్భ, ఓపెన్‌కాస్ట్ గనులు
- కొత్తవి ప్రారంభించడంలో అంతులేని జాప్యం
- సవాల్‌గా మారుతున్న మిగులు కార్మికుల సమస్య
- సంస్థపై పడుతున్న ఆర్థిక భారం



ఇల్లెందులోని జేకే ఓసీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రణాళికాయుతంగా కొత్త గనులు ప్రారంభించడంలో సింగరేణి సంస్థ విఫలమవుతోంది. దీంతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి సాధనకు ఇబ్బందులు ఎదురవడమే కాక సంస్థపై ఆర్థికంగానూ భారం పడుతోంది.

పుట్టినింట మనుగడ ప్రశ్నార్థకం..

ఇల్లెందు ఏరియాను సింగరేణికి పుట్టిల్లు అంటారు. బ్రిటిష్ జమానాలో ఇక్కడ మొదలైన సింగరేణి ప్రస్థానం ఆరు జిల్లాలకు విస్తరించింది. అందువల్లే ఇల్లెందు ప్రాంతానికి ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏరియాల్లోనూ ఆఫీసర్స్ క్లబ్‌ను ఇల్లెందు క్లబ్‌గా పిలుస్తారు. అయితే పుట్టినిల్లయిన ఇల్లెందు ఏరియాలోనే ప్రణాళిక లోపం కారణంగా సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడి జవహర్‌ఖని (జేకే) ఓపెన్‌కాస్ట్ గనిలో నాణ్యమైన బొగ్గు నిల్వలు ఐదేళ్ల కిందటే ముగింపు దశకు వచ్చాయి. దీంతో ఈ ఓపెన్ కాస్టును సమీపంలోని రొంపేడు ప్రాంతం వరకు విస్తరించడం ద్వారా ఇల్లెందులో సింగరేణికి మరో 20 ఏళ్ల భవిష్యత్ కల్పించాలని సంస్థ భావించింది.

ప్రధాన కేంద్రంలో

సింగరేణి ప్రధాన కార్యాలయం కొత్తగూడెంలో ఉంది. ఈ ఏరియా పరిధిలో కేవలం పద్మావతిఖని (పీవీకే–5 ఇంక్లైన్) భూగర్భ గనిలోనే బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ఇక ఇక్కడున్న వెంకటేశ్‌ఖని (వీకే 7 షాఫ్ట్ భూగర్భ గని), గౌతంఖని ఓపెన్‌కాస్టులలో 2021లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక్కడ పని చేస్తున్న కార్మికుల్లో 600 మందిని ఇతర గనులు, ఏరియా స్టోర్స్, సెంట్రల్ వర్క్‌షాపు, సివిల్ డిపార్ట్‌మెంట్లలో సర్దుబాటు చేశారు. అప్పటి నుంచి ఈ రెండు గనుల నిర్వహణ కోసం సుమారు వంద మంది కార్మికులు పని చేస్తున్నారు. తాజాగా వీకే గనిని పూర్తిగా మూసివేశారు. దీంతో ఇక్కడున్న కార్మికులకు పని కల్పించాల్సిన పరిస్థితి ఎదురైంది.

ఇక్కడా ఆలస్యమే

ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం మూడేళ్ల కిందటే ఉత్పత్తి నిలిచిపోయిన గౌతంఖని ఓపెన్ కాస్ట్, వెంకటేశ్‌ఖని భూగర్భ గనులను కలిపేస్తూ వెంకటేశ్‌ఖని ఓపెన్ కాస్ట్ ప్రారంభించాలని నిర్ణయించారు. కానీ అనుమతులు రాని కారణంగా ఇప్పటివరకు ఈ గనిలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాలేదు. నూతన గనులు అందుబాటులోకి వస్తేనే మూతబడిన గనులకు సంబంధించిన మిగులు కార్మికులకు చేతినిండా పని దొరుకుతుంది. లేదంటే వారికి సరైన పని అప్పజెప్పకుండా వేతనాలు చెల్లించాల్సి వస్తుంది. తద్వారా ఉత్పత్తి వ్యయం పెరిగి సంస్థపై ఆర్థిక భారం పడనుంది.

ఎప్పుడయ్యేనో..

ఇల్లెందు జేకే, కొత్తగూడెం వీకే ఓపెన్ కాస్ట్‌లతో పాటు మణుగూరులో నూతన ఓపెన్ కాస్ట్, ఒడిశాలోని నైనీ గనులు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ గనులకు సంబంధించిన పనులు ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు... అన్నట్టుగా మారాయి. ఈ గనుల్లో రాబోయే ఈనెల, లేదా జూలై నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామనే మాట తాజాగా అధికార యంత్రాంగం నుంచి వస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అంత సానుకూలంగా లేవనే అభిప్రాయం కార్మికుల నుంచి వస్తోంది. కనీసం ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికైనా ఈ గనుల్లో బొగ్గు ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోకుంటే సింగరేణిని మిగులు కార్మికుల సమస్య వేధించే అవకాశం ఉంది.

అంతులేని ఆలస్యం..

ఇల్లెందు జేకే ఓసీ విస్తరణకు అన్ని రకాల అనుమతులు సాధించడంలో సంస్థ తరఫున అంతులేని జాప్యం జరుగుతోంది. జేకే ఓపెన్ కాస్ట్ గనిలో విలువైన బొగ్గు నిక్షేపాల వెలికితీత ఇప్పటికే పూర్తి కావొచ్చినా, కొత్త గనికి అనుమతులు రాలేదు. ఇక్కడ పని చేస్తున్న కార్మికులు, యంత్రాలను ఇతర ప్రాంతాలకు తరలించలేక.. గతంలో జేకే ఓసీలో ఉత్పత్తి వ్యయం ఎక్కువ అవుతుందనే కారణంతో తీయకుండా వదిలేసిన బొగ్గు నిల్వలను వెలికితీసే పనికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు జేకే ఓసీలో ప్రస్తుతం ఓవర్‌బర్డెన్ (ఓబీ) తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. మరో 30 రోజుల్లో ఇక్కడి నుంచి కొంత మేర బొగ్గును ఆరు నెలల పాటు ఉత్పత్తి చేసేందుకు ఆస్కారం ఉంది. అప్పటి వరకైనా జేకే ఓసీ (రొంపేడు ఓసీ)లో బొగ్గు తవ్వకాలు ప్రారంభం కావాలి. లేదంటే ఇల్లెందు పట్టణంలో సింగరేణి సవ్వడులు మూగబోయినట్టే అవుతుంది.

రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సాగులో కొత్త ఒరవడి

- వ్యవసాయ రంగంలో మోడల్‌గా జిల్లా
- మెట్ట, మాగాణి పద్ధతిలో వరి సాగు
- విత్తనోత్పత్తిలో పెట్టింది పేరు
- విదేశాల్లో డిమాండ్ ఉన్న మిర్చి సాగు ఇక్కడే..
- అశ్వారావుపేట వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్



ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ రంగంలో జిల్లా కొత్త ఒరవడులు సృష్టిస్తోంది. చైతన్యవంతులైన ఇక్కడి రైతులు పంటల సాగులో ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవడంలో ముందు నిలుస్తున్నారు. వాతావరణం, నేలల అనుకూలత కలిసొస్తుండడంతో దేశ, విదేశాల్లో డిమాండ్ ఉన్న పంటల సాగుకు ఇక్కడి రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. విత్తనోత్పత్తిలోనూ జిల్లాకు మంచి పేరు ఉంది. ఇక విదేశాల్లో డిమాండ్ ఉన్న 'తేజా' రకం మిర్చి పంట సాగుకు మూలం ఈ జిల్లానే. తెలంగాణ ఏర్పడ్డాక గడిచిన పదేళ్లలో వివిధ రకాల పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. వరి, పత్తి, మిర్చి, ఆయిల్ పాం వంటి పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగగా.. ఉద్యాన పంటల సాగులోనూ రాష్ట్రంలోనే జిల్లా అగ్రగామిగా నిలుస్తోందని అశ్వారావుపేట వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్ తెలిపారు. సుదీర్ఘకాలం పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా డాట్ సెంటర్ కోఆర్డినేటర్‌గా, వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం అశ్వారావుపేట వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పంటల సాగు, ప్రత్యేకతలను 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

అన్నదాతల ప్రయోగాలు

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా వరి సాగులో జిల్లాలో భిన్నమైన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వర్షాల కోసం సమయం వృథా చేయకుండా నూతన పద్ధతులతో పంటల సాగుకు అన్నదాతలు చేసిన ప్రయోగాలు ఫలించాయి. పూర్తిగా నీటిలో సాగు చేసే వరి పంటను మెట్ట పద్ధతుల్లో సాగు చేయొచ్చని ఇక్కడి రైతులు నిరూపించడంతో ఈ విధానం పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు సైతం విస్తరించింది. మెట్ట, మాగాణి పద్ధతుల్లో వరి సాగు చేస్తూ ఇక్కడ రైతాంగం ఆదర్శంగా నిలుస్తోంది. అంతేకాక కూలీల ఖర్చు లేకుండా నేరుగా విత్తే విధానం, డ్రమ్ సీడర్ పద్ధతుల్లోనూ ఉత్తమ దిగుబడులు సాధిస్తున్నారు.

ఖమ్మం మిర్చికి డిమాండ్

విదేశాల్లో డిమాండ్ ఉన్న 'తేజ' రకం మిర్చిని జిల్లా రైతులు సాగు చేస్తుండగా ఐదారేళ్లుగా గణనీయంగా పెరిగింది. జిల్లాల విభజనకు ముందు ఈ రకాన్ని 20 నుంచి 30 వేల ఎకరాల్లో సాగు చేయగా.. ఇప్పుడు ఒక ఖమ్మం జిల్లాలోనే లక్ష ఎకరాలకు పైగా రైతులు సాగు చేస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కేంద్రంగా ఈ రకం మిర్చిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు చైనా సహా వివిధ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. తద్వారా రైతులకు మేలైన ధర లభిస్తోంది. ఇక తెగుళ్లు, తామర పురుగు నివారణకు తక్కువ ఖర్చుతో నీలి, పసుపు రంగు జిగురు అట్టలు, వేప కషాయంతో కలిపిన మందులను పిచికారీ చేస్తూ సమస్యలను అధిగమిస్తున్నారు.

కొత్త వంగడాలతో అధికోత్పత్తి

జిల్లా రైతులు ఎప్పటికప్పుడు నూతన వరి వంగడాలను నాటి అధికోత్పత్తి సాధిస్తున్నారు. పూర్వం ఒకటి, రెండు రకాలనే సాగు చేసే రైతులు ప్రస్తుతం తెలంగాణ ఆర్ఎన్ఆర్ సోనా రకం, కేఎన్ఎం 118, వరంగల్–44, జేజీఎల్ 24423, కేఎన్ఎం 1638 వంటి రకాలనూ ఎంచుకుంటున్నారు. వానాకాలం, యాసంగి పంటలుగా పలు కంపెనీలకు చెందిన బైబ్యాక్ రకాలను కూడా సాగు చేస్తుండడంతో అధిక ధరలు పొందే అవకాశం ఏర్పడుతోంది.

పత్తిలో 'అధిక సాంద్రత'

పత్తిని సైతం ప్రస్తుతం అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసేందుకు రైతులు ముందుకొస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా చాలాసార్లు అధిక దిగుబడి సాధించడమే కాక మరో పంట సాగుకు అవకాశం ఉంటోంది. గడిచిన రెండేళ్లుగా ఈ పద్ధతిని అవలంబిస్తున్న పలువురు రెండో పంటగా మొక్కజొన్న సాగు చేసి ఆదాయాన్ని గడిస్తున్నారు. పత్తి సాగులో రసం పీల్చే పురుగు నియంత్రణకు కాండానికి మందు పూసే పద్ధతి సైతం జిల్లా రైతులే ఆవిష్కరించారు.

విత్తనోత్పత్తిలో భేష్

పలు రకాల పంటల విత్తనోత్పత్తికి జిల్లా పేరు గాంచింది. వరి, మొక్కజొన్న, అపరాల పంటల్లో పెసర, మినుము వంటి పంటల విత్తనోత్పత్తి జరుగుతోంది. పెసర విత్తనోత్పత్తిలో మధిర రకానికి మంచి పేరు ఉండగా.. వివిధ రకాలకు అనువైన రకం కావడంతో అంతా ఆసక్తి కనబరుస్తున్నారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ప్రాసెసింగ్ చేసి విత్తనాలను వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇక మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాలను వివిధ కంపెనీలు అధిక మొత్తంలో రైతుల ద్వారా ఉత్పత్తి చేయిస్తున్నాయి. మూడు, నాలుగేళ్లుగా ఈ విత్తనాల ఉత్పత్తితో రైతులు ఆదాయం పొందుతున్నారు.

ఉద్యాన పంటల్లో అగ్రగామి

రాష్ట్రంలోనే ఉద్యాన పంటల సాగులో జిల్లా అగ్రగామిగా నిలుస్తోంది. ఇక్కడ పండించే మామిడిని దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. విదేశీ ఎగుమతులకు అనుగుణంగా ఇక్కడ సాగులో నాణ్యమైన విధానాలను అవలంబిస్తున్నారు. మరోపక్క ఆయిల్ పామ్ సాగులోనూ ప్రభుత్వ ప్రోత్సాహకాలతో జిల్లా దూసుకెళ్తోంది. దిగుబడులకు అనుగుణంగా పలు కంపెనీలు పరిశ్రమలను ఏర్పాటు చేస్తుండగా.. రైతులకు మార్కెటింగ్ సౌకర్యం సులభతరమైంది.

క్లుప్తంగా

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

తల్లాడ: మండలంలోని నారయ్యబంజరకు చెందిన ఓ యువకుడు మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన బానోత్ ఈశ్వర్(22) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఆయన అప్పు చేసి మోటార్ సైకిల్ కొనగా, అప్పు తీర్చలేక, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. ఘటనపై ఆయన తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

వేధింపులు తాళలేక వివాహిత..


విజయ (ఫైల్)

ఏన్కూరు: వరకట్నం కోరలకు ఓ వివాహిత బలైంది. ఇన్‌స్టాగ్రాంలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి కుటుంబ సభ్యులను ఎదిరించి పెళ్లి చేసుకున్న ఆమె ఏడాది లోగానే వరకట్నం వేధింపులతో మనస్తాపం చెంది తనువు చాలించింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏన్కూరుకు చెందిన చిలుకూరి అఖిల్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం వేములవాడకు చెందిన పూనేం విజయ (23)తో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో గత ఏడాది కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇద్దరు వివాహం చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు అంగీకరించడంతో విజయ భర్తతో కలిసి వారి ఇంట్లోనే ఉంటోంది. అయితే, ప్రేమ వివాహం ప్రశాంతంగా సాగుతుందని విజయ భావించగా ఆమెకు వరకట్న వేధింపులు మొదలయ్యాయి. భర్తకు తోడు అత్త, ఆడపడుచు తరచుగా కట్నం కోసం వేధిస్తుండటంతో మనస్తాపానికి గురై మంగళవారం సాయంత్రం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొంది. ఘటనపై మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాదావత్ రవికుమార్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఓ వివాహిత కనిపించకుండా పోవడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన ఓ యువతికి మూడు నెలల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. కాగా మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వివాహిత తిరిగి బుధవారం సాయంత్రం వరకు రాలేదు. దీంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నేలకొండపల్లి: మేతకు వెళ్లిన పాడి గేదె విద్యుత్ తీగలను తాకకడంతో షాక్ గురై మృత్యువాత పడింది. మండలంలోని కట్టుకాచారంలో రైతు అంకిరాల బ్రహ్మంకు చెందిన పాడి గేదె బుధవారం మేతకు వెళ్లగా, గ్రామ శివారులో పొలాల మధ్య తెగిపడిన విద్యుత్ తీగలను తాకి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. అయితే, దాని వెనుకాలే మరికొన్ని గేదెలు, రైతులు ఉండగా.. ప్రమాదాన్ని గ్రహించి దూరంగా వెళ్లిపోయారు. కాగా, మృతి చెందిన గేదె దాదాపు రూ.లక్ష వరకు ఉన్నందున తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన పెయింటింగ్ మేస్త్రీ గజ్జల శ్రీనివాస్‌పై దాడి జరిగిందని ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైయింది. పోలీసుల కథనం ప్రకారం గజ్జల శ్రీనివాస్ ఇటీవల హైదరాబాద్‌లో బీజేపీ నాయకుల వద్దకు వెళ్లి వచ్చాడనే నెపంతో మంగళవారం ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ సమీపాన పార్టీ కార్యాలయం వద్దకు కుమిలి శ్రీనివాస్ పిలిపించి అకారణంగా దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనలో గాయపడిన గజ్జల శ్రీనివాస్ చికిత్సపొందుతూ ఆయన భార్య పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

ముందస్తుగా సిద్ధం

- విద్యుత్ సమస్యల గుర్తింపు.. పరిష్కారం
- మరో వారం పాటు 'ప్రీ మాన్సూన్' పనులు
- వర్షం, గాలిదుమారానికి సరఫరాలో ఇక్కట్లు రాకుండా జాగ్రత్త
- జిల్లా వ్యాప్తంగా పనుల్లో నిమగ్నమైన విద్యుత్ శాఖ యంత్రాంగం


పెనుబల్లి సబ్‌స్టేషన్ పరిధి నారాయణపురంలో లైన్ పనులు చేస్తున్న సిబ్బంది

ఖమ్మంవ్యవసాయం: వర్షాకాలంలో వర్షం, ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరాలో తరచుగా ఎదురయ్యే సమస్యల నివారణకు విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. 'ప్రీ మాన్సూన్' పేరిట టీజీ ఎన్పీడీసీఎల్ ఆదేశాలతో జిల్లాలోని ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, సత్తుపల్లి, వైరా విద్యుత్తు డివిజన్ల పరిధిలో యంత్రాంగం దృష్టి సారించింది. ఈ ఏడాది మే ఆరంభం నుంచే అకాల వర్షాలు, ఈదురుగాలులు ప్రభావం కనిపిస్తోంది. దీంతో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ టవర్లు కూడా కూలిపోయాయి. అంతేకాక రహదారుల వెంట వృక్షాలు, కొమ్మలు విద్యుత్ లైన్లపై పడటంతో శాఖకు రూ.50 లక్షల మేరకు నష్టం వాటిల్లడమే కాక సరఫరాకు అంతరాయం కలిగింది. ఈనేపథ్యాన వర్షాలు పెరగనుండడంతో ఎలాంటి అంతరాయలు ఎదురుకాకుండా ముందస్తు పనులు చేపడుతున్నారు.

సమస్యలు గుర్తిస్తూ.. పరిష్కరిస్తూ...

జిల్లాలోని 54 చోట్ల 33/11 కేవీ సబ్ స్టేషన్లతో పాటు 11 కేవీ 545 ఫీడర్ల పరిధిలో సమస్యలు ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. ఆయా సబ్ స్టేషన్లు, ఫీడర్ల పరిధిలో సమస్యల పరిష్కారానికి ప్రీ మాన్ సూన్ పనులుచేపడుతున్నారు. సెక్షన్ ఆపరేషన్స్ ఏఈల పర్యవేక్షణలో లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులతో పనులు నిర్వహిస్తున్నారు. సాధారణంగా ప్రతీ శనివారం విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తారు. అయితే, ప్రీ మాన్ సూన్ పనులు మాత్రం దాదాపు నిత్యం ఏదోచోట నిర్వహిస్తూ... ఒకేసారి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ముందస్తు సమాచారం ఇచ్చిపనులు చేపడుతున్నారు.


వెలుగుమట్లలో విద్యుత్ లైన్‌కు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

ప్రణాళికాయుతంగా..

ప్రీ మాన్సూన్ పనులను ఈనెల రెండో వారంకల్లా పూర్తిచేయాలని విద్యుత్ యంత్రాంగం ప్రణాళిక రూపొందించుకుంది. ఇందులో ప్రధానంగా విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. ఈదురుగాలులకు వంగిపోయిన స్తంభాలు, వేలాడుతున్న తీగలను సరిచేయడం వంటి పనులను కొనసాగుతున్నాయి. అంతేకాక ఇన్సులేటర్ల మార్పు, కొత్త ఫ్యూజ్ బాక్సులను అమర్చడం చేపడుతున్నారు. కొన్నిచోట్ల తరచుగా మొరాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి అమర్చే పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుబాబుల్ తోటల వెంట ఉన్న విద్యుత్తు లైన్లలో ఇబ్బందులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి నష్ట నివారణ చర్యలపై దృష్టి సారించారు.

అంతరాయాలు లేకుండా చర్యలు



వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు పనులు చేపడుతున్నాం. జిల్లాలోని యంత్రాంగం పూర్తి స్థాయిలో ఈ పనుల్లోనే నిమగ్నమైంది. నిబంధనలకు లోబడి ఎల్‌సీ తీసుకుంటూ పనులు చేస్తున్నారు. ఈనెల రెండో వారం కల్లా పనులు పూర్తి చేసి వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయాలని ప్రణాళిక రూపొందించుకున్నాం.

– ఏ.సురేందర్, ఎస్ఈ, ఖమ్మం సర్కిల్

బిర్యానీలో బొద్దింక ఎక్స్‌ట్రా!

- ఖమ్మంలోని ఓ బిర్యానీ సెంటర్‌లో ఘటన
- 'ఇంట్లో చేస్తే రాదా' అంటూ నిర్వాహకుల సమాధానం
- వరుస ఘటనలతోనైనా మేల్కొనని ఆహార తనిఖీ, మున్సిపల్ అధికారులు


బిర్యానీలో వచ్చిన బొద్దింక


రాయల్ గ్రాండ్ హోటల్‌లో బిర్యానీని పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకుల తీరు వినియోగదారులను బెంబేలెత్తిస్తుంది. నిల్వ ఆహారం, గడువు తీరిన మసాలాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు వడ్డిస్తుండడమే కాక కనీస పరిశుభ్రత పాటించడం లేదని కొద్దిరోజుల క్రితం అధికారులు చేసిన తనిఖీల్లో బయటపడింది. ఇప్పుడు ఏకంగా చికెన్ బిర్యానీలో బొద్దింక రావడంతో భోజన ప్రియులు రెస్టారెంట్లకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ సమీపాన ఉన్న రాయల్ గ్రాండ్ రెస్టారెంట్‌కు బుధవారం గురునాథంతో పాటు మరో వ్యక్తి వెళ్లగా బిర్యానీలో బొద్దింక దర్శనమిచ్చింది. దీంతో షాక్‌కు గురైన ఆయన నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్తే బయట నుంచి వచ్చి పడిందేమో అనే అనుమానం వ్యక్తం చేయడం గమనార్హం. కానీ బిర్యానీలో బొద్దింక ఉడికినట్లు ఉందని చెబుతున్నా పట్టించుకోకపోవడంతో ఆహార తనిఖీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే, అధికారులు కేఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయాలని చేతులెత్తేయడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేశారు. ఆపై బిర్యానీలో బొద్దింక ఉన్న వీడియోను తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది.

ఇంట్లో పెళ్లాం చేస్తే రాదా?

ట్యాంక్ బండ్ సమీపాన రాయల్ గ్రాండ్ రెస్టారెంట్‌లో బిర్యానీలో బొద్దింక విషయమై ఫిర్యాదు చేస్తే ఆహార తనిఖీ అధికారులు తొలుత కేఎంసీ ఉద్యోగులకు సమాచారం ఇవ్వాలని సెలవిచ్చారు. ఇంతలోనే విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాయల్ గ్రాండ్ రెస్టారెంట్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. కిచెన్‌లోని బిర్యానీ, ఇతర వంటకాలు, నిల్వ ఉన్న మసాలాలు, మాంసాన్ని పరిశీలించారు. ఈమేరకు బిర్యానీలో బొద్దింక రావడంపై హోటల్ యజమానిని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించగా.. బయట నుంచి వచ్చిన రెక్కల పురుగు పడిందని సమర్థించుకున్నారు. అంతేకాక 'ఇంట్లో పెళ్లాం వండితే పురుగులు పడవా' అని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎదుటే వినియోగదారులను యజమాని దబాయించడం గమనార్హం.


వినియోగదారుడికి అందజేసిన బిర్యానీ

ఆపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరించారు. అంతేకాక నిర్వహణ లోపాలు సరిచేసుకోవాలని యజమాన్యాన్ని ఆదేశించినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు. అయితే, ఖమ్మంలోని హోటళ్లలో వైఫల్యాలు వరుసగా బయటపడుతున్నా అటు మున్సిపాలిటీ, ఇటు ఫుడ్ సేఫ్టీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడగకుండానే డ్వాక్రా గ్రూప్ ఖాతాల్లో రుణాలు

వడ్డీ చెల్లించాలని బ్యాంకర్ల ఒత్తిడి?

రఘునాథపాలెం: గ్రూప్ సభ్యులకు తెలియకుండా, వారు అడకుండానే గ్రూప్ ఖాతాల్లో రుణం పేరుతో డబ్బు జమ చేసి.. ఇప్పుడు వడ్డీ చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. రఘునాథపాలెం మండలంలోని రేగులచలక తదితర గ్రామాల్లో కొద్దినెలల క్రితం ఆయా గ్రూప్ సభ్యులు ప్రమేయం లేకుండానే బ్యాంకర్లు టార్గెట్ పేరుతో ఒక్కో గ్రూప్ ఖాతాలో రూ.2లక్షలల చొప్పున రుణాలు జమ చేసినట్లు తెలిసింది. అయితే, ఈ విషయాన్ని సభ్యులు గుర్తించలేదని చెబుతుండగా.. ఇప్పుడు వడ్డీ చెల్లించాలని అడుగుతుండడంతో విషయం బయటపడింది. ఇలా ఒక్క రేగులచలకలోనే ఆరు గ్రూపుల ఖాతాల్లో రూ.2లక్షల చొప్పున జమ చేసినట్లు సమాచారం. తమకు తెలియకుండా, అడగకుండానే నగదు జమ చేయడం.. తాము అవసరాలకు వినియోగించకుండానే ఇప్పుడు వడ్డీ కట్టాలని సూచించడం సరికాదని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. ఈ విషయమై ఐకేపీ ఏపీఎం శారదను వివరణ కోరగా సభ్యుల సంతకాలు లేకుండా రుణం ఇవ్వడం,గ్రూప్‌ల నుండి ఎంసీపీ(మైక్రో క్రెడిట్ ప్లాన్) లేకుండా రుణం జమ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అయినప్పటికీ పూర్తి వివరాలు తెలుసుకుని విచారణ జరిపిస్తామని తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


ధ్వంసమైన ఆటో

బూర్గంపాడు: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన నిలిపిన ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. కొత్తగూడెం డిపోకు చెందిన బస్సు భద్రాచలం నుంచి ఖమ్మం వెళ్తున్న క్రమంలో బూర్గంపాడు బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన నిలిపిన ఆటోను వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటో పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి తగిలి పూర్తిగా దెబ్బతింది. ఆటోడ్రైవర్ రమేశ్ రోడ్డు పక్కన ఆటోను నిలిపి ఫోన్ మాట్లాడేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆటో ప్రమాదానికి గురవగా.. అందులో ఎవరు లేకపోవటంతో పెద్దప్రమాదం తప్పింది. ఆటోడ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటా..

ఖమ్మం ఎంపీ అభ్యర్థి వినోద్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌రావు, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆ పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు వెల్లడించారు. ఖమ్మంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో వచ్చానని తెలిపారు. ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకవుతూవారి సమస్యల పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం చూసినా 1.18 లక్షల మంది ఓటు వేశారని వెల్లడించారు. ఈమేరకు ఓటు వేసిన వారితో పాటు ఎన్నికల్లో శ్రమించిన బీజేపీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో దీటైన పోటీ ఇస్తూ విజయాన్ని దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం రాథోడ్, నాయకులు అల్లిక అంజయ్య, కుమిలి శ్రీనివాస్, చావా కిరణ్, గెంటెల విద్యాసాగర్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, ధనియాకుల వెంకటనారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ సాధించిన విద్యార్థులకు పురస్కారాలు

ఖమ్మంగాంధీచౌక్ : ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో జరిగిన పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీ వైష్ణవ విద్యార్థులకు శ్రీ వైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో జూలైలో జరిగే రజతోత్సవాల సందర్భంగా ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషబట్టర్ రఘునాథాచార్యులు, కొదమసింహం రవికిరణాచార్యులు, నాయకులు ఎన్‌సీహెచ్.శ్రీనివాసాచార్యులు, రామకృష్ణమాచార్యులు, వేదాంతం ఫణికుమారాచార్యులు బుధవారం ఒక ప్రకటన విడదల చేశారు. విద్యార్థులు సాధించిన మార్కులు, పేరు, తండ్రిపేరు, చిరునామాతో సంఘం కార్యాలయానికి పంపించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం వారికి మాత్రమే ఈ పురస్కారాలు ఉంటాయని పేర్కొన్నారు. 8వ తరగతి, ఆపైన చదివే పేద శ్రీవైష్ణవ విద్యార్థులకు ఆర్థిక సాయం కూడా అందజేస్తామని తెలిపారు. పేరు, తండ్రిపేరు, వృత్తి, ఆదాయం వివరాలతో పాటు విద్యార్థి చదివే పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ జతచేసి ఈనెల 30వ తేదీలోగా స్వయంగా లేదా పోస్ట్ ద్వారా శ్రీ వైష్ణవ సేవా సంఘం, శ్రీ వైష్ణవ సదనం, రోడ్డు నంబర్ 5, చంద్రపురి కాలని, ఎల్‌బీనగర్, హైదరాబాద్– 500074 చిరునామాకు పంపించాలని సూచించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


యువకులను అదుపులోకి తీసుకుంటున్న ఎస్‌ఐ, సిబ్బంది

కారేపల్లి: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను కారేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్యనారాయణపురం గ్రామానికి చెందిన జోగా సంతోష్, పూనెం సందీప్ కొంత మొత్తంలో గంజాయిని తీసుకొచ్చారు. అనంతరం దీన్ని చిన్న ప్యాకెట్లుగా మార్చి ఇల్లెందు, ఉసిరికాయలపల్లి పరిసరాల్లో విక్రయిస్తున్నారనే సమాచారంతో కారేపల్లి ఎస్‌ఐ ఎస్.రాజారాం, సిబ్బందితో తనిఖీలు చేపడుతుండగా పట్టుబడ్డారు. దీంతో సంతోష్, సందీప్‌ను అరెస్ట్ చేసి అర కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన నలుగురి అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ బాలకృష్ణ

ఖమ్మంక్రైం: నిరుద్యోగ యువత ఆశలను ఆసరాగా చేసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలతో నమ్మించి మోసం చేసిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఖమ్మం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఖమ్మం వైఎస్సార్ కాలనీకి చెందిన బొమ్మ పూర్ణచంద్రరావు, కమాన్‌బజార్‌కు చెందిన దివ్వెల వెంకట మధుసూదన్‌రావు, ముస్తఫానగర్‌కు చెందిన కొత్తపల్లి సత్యనారాయణ, జమ్మిబండకు చెందిన విజ్జగిరి శ్రీనివాస్ ముఠాగా ఏర్పడి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.1.50లక్షల వేతనానికి ఔట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్లుగా ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలకడమే కాక ఏడుగురి పేర్లతో నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తయారుచేశారని పేర్కొన్నారు. ఇందుకోసం పెద్దమొత్తంలో డబ్బు వసూలుకు పన్నాం పన్నగా ముందస్తు సమాచారంతో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. తద్వారా నిరుద్యోగులు డబ్బులు చెల్లించి నష్టపోకుండా చూశామని సీఐ వెల్లడించారు.

పిడుగుపాటుకు మూడు ఎద్దులు మృతి

కరకగూడెం: మండలవ్యాప్తంగా బుధవారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులలో కూడిన భారీ వర్షం కురిసింది. కొత్తగూడెం గ్రామ రైతులు మంకిడి నారాయణ, బాబు, ఇర్ప రామారావుకు చెందిన మూడు దుక్కిటెద్దులు పిడుగుపాటుతో మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటాయని రైతులు వాపోయారు. తాటిగూడెం గ్రామానికి చెందిన జాడి రమేశ్, పూనెం కిశోర్ ఇళ్ల పైకప్పులు నేలమట్టమయ్యాయి. తద్వారా ఇంట్లో సామగ్రి పూర్తిగా ధ్వంసమైంది. గాలివాన బీభత్సంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

టేకులపల్లిలో మూడు ఎద్దులు..

టేకులపల్లి: విద్యుదాఘాతంతో ఎద్దులు మృత్యువాత పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. చుక్కాలబోడు సమీపంలో బుధవారం మాలోతు నరేందర్, మాలోతు సోనియా, మాలోతు మోహన్‌కు చెందిన మూడు ఎద్దులు మేత కోసం పంట పొలాలకు వెళ్లాయి. ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి.

గాలివాన బీభత్సం

- సత్తుపల్లి డివిజన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి 7గంటల నుంచి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సత్తుపల్లి డివిజన్‌లో ఈదురుగాలుల ప్రభావం ఎక్కువగా ఉండడంతో సత్తుపల్లి పెనుబల్లి, వేంసూరు తదితర మండలాల్లో విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు పడగా సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో శాఖ ఉద్యోగులు పునరుద్ధరణ పనులు చేపట్టారని ఎస్ఈ సురేందర్ తెలిపారు. కాగా, సత్తుపల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాలు రాత్రి 9–30 గంటల వరకు అంధకారంలోనే ఉన్నాయి. ఇక ఖమ్మం పరిసర ప్రాంతాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ అంతరాయం నెలకొంది. పగటి పూట 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదు కాగా ఉక్కపోతతో సతమతమైన ప్రజలు సాయంత్రం కురిసిన వాన, చల్లని గాలులతో ఊరట పొందారు.

వ్యవసాయ పనులపై దృష్టి

రుతుపవనాలు విస్తరిస్తున్న నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తొలకరి ఆరంభం నుంచే వాతావరణం అనుకూలంగా ఉండడంతో అన్నదాతలు వ్యవసాయ పనులు వేగిరం చేస్తున్నారు. గత నెలలో కురిసిన అకాల వర్షాలతో రైతులు దుక్కులు దున్నగా.. కొన్నిచోట్ల నల్ల రేగడి నేలల్లో పొడి దుక్కుల్లోనే పత్తి విత్తనాలు విత్తారు. గత శని, ఆదివారాల్లో జిల్లా వ్యాప్తంగా ఓ మొస్తరు, బోనకల్, నేలకొండపల్లి మండలాల్లో భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పత్తి, అపరాల పంటలతో పాటు మిర్చి నార్లు పోయడమేకాక వరి మాగాణుల్లో దుక్కులు చేయడంపై రైతులు దృష్టి సారించనున్నారు.


రాష్ట్రానికి 4 కేంద్ర మంత్రి పదవులు!

ఎన్డీఏలో కీలకంగా మారిన టీడీపీ | కీలక శాఖలు కోరుతున్న చంద్రబాబు | జనసేన, ఏపీ బీజేపీ నేతలకూ చాన్స్

సాక్షి, అమరావతి: మారిన రాజకీయ పరిణామాలతో కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి సముచిత ప్రాధాన్యం దక్కనుంది. ఎన్డీఏలో టీడీపీ మద్దతు కీలకం కావడంతో జాతీయ రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషించే అవకాశం లభించింది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును ఎన్డీఏ కన్వీనర్‌గా నియమించేందుకు బీజేపీ సుముఖంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. బీజేపీ పెద్దల ప్రతిపాదనపై చంద్రబాబు ఇంకా నిర్ణయం తీసుకోలేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి చంద్రబాబు హాజరు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. చంద్రబాబుకు ఎన్డీఏ కన్వీనర్‌గా అవకాశం వచ్చినా, రాకపోయినా టీడీపీ మద్దతు కీలకంగా మారినట్లు స్పష్టమవుతోంది. ఇకపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల్లో టీడీపీ మాట చెల్లుబాటవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. తాజా రాజకీయ ముఖచిత్రం నేపథ్యంలో కేంద్రంలో తమకు ప్రాధాన్యత కలిగిన మంత్రిత్వ శాఖలు కేటాయించాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరుతున్నట్లు సమాచారం. ఏపీ నుంచి నలుగురు లేదా ఐదుగురికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. టీడీపీ నుంచి కనీసం ఇద్దరు ముగ్గురికి అవకాశం లభిస్తుందని చెబుతున్నారు. ఏపీ బీజేపీ, జనసేన నుంచి ఒక్కరికైనా ఛాన్స్ ఉండవచ్చనే భావిస్తున్నారు. టీడీపీ తరఫున గెలిచిన ఎంపీల్లో కింజరపు రామ్మోహన్‌నాయుడి పేరు కేంద్ర మంత్రి పదవికి గట్టిగా వినిపిస్తోంది. అమలాపురం ఎంపీగా గెలిచిన గంటి హరీష్ మాథుర్, నెల్లూరు నుంచి గెలిచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బాపట్ల నుంచి గెలిచిన టి.కృష్ణప్రసాద్ పేర్లు కూడా కేంద్ర మంత్రి పదవుల రేసులో వినిపిస్తున్నాయి. బీజేపీ తరఫున గెలిచిన సీఎం రమేష్, దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర మంత్రివర్గంలో స్థానం కోసం పోటీ పడుతున్నారు. సీఎం రమేష్ అటు బీజేపీ పెద్దలకు, ఇటు చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తి కావడంతో ఆయనకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. జనసేన నుంచి గెలిచిన ఇద్దరు ఎంపీల్లో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి మంత్రి పదవి కోసం గట్టి లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జల్ శక్తి, రవాణా, వ్యవసాయం, ఆరోగ్య మంత్రిత్వ శాఖలను చంద్రబాబు అడుగుతున్నట్లు చెబుతున్నారు. లోక్‌సభ స్పీకర్ లాంటి కీలక పదవులను కూడా టీడీపీ ఆశిస్తున్నట్లు పేర్కొంటున్నారు. రెండు రోజుల్లో దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఇలాంటి పోరు ఇదే తొలిసారి

కూటమి సమష్టి కృషితో ఎన్నికల్లో విజయం: చంద్రబాబు



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. కూటమి నేతలు, కార్యకర్తల సమష్టి కృషి వల్లే ఈ విజయం దక్కిందన్నారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చింది అధికారం మాత్రమే కాదని, ఒక ఉన్నతమైన బాధ్యత అప్పగించారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని రంగాలు, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ వైఎస్ జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. భూమి మీద ఎవరూ శాశ్వతం కాదని, దేశం, ప్రజాస్వామ్యం, పార్టీలే శాశ్వతమన్నారు. ఈ తీర్పుతో రాష్ట్రంలో అందరికీ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఇంత చరిత్రాత్మక ఎన్నికలను తన జీవితంలో చూడలేదని వ్యాఖ్యానించారు. విదేశాల్లో ఉండే వ్యక్తులు రూ.లక్షలు ఖర్చు పెట్టుకుని వచ్చి మరీ ఓటు వేశారన్నారు. టీడీపీ, ఏపీ చరిత్రలో ఈ విజయం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదన్నారు. టీడీపీని స్థాపించినప్పుడు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో 200 సీట్లు వచ్చాయని, 1994లో ప్రతిపక్షానికి కొన్ని చోట్ల డిపాజిట్లు కూడా రాలేదని, వాటన్నింటినీ అధిగమించి ఇప్పుడు ఇంత విజయం చేకూరడానికి ప్రజలు అనుభవించిన బాధలే కారణమన్నారు. ఈ ఎన్నికల్లో కూటమికి 55.38 శాతం ఓట్లు లభించగా ఇందులో టీడీపీకి 45.60 శాతం ఓట్లు వచ్చాయని చంద్రబాబు చెప్పారు. వైఎస్సార్‌సీపీకి 39.37 శాతం ఓట్లు దక్కాయన్నారు. గతంలో కుప్పం, సిద్దిపేట మెజారిటీల్లో పోటీ పడేవని, ఇప్పుడు గాజువాక, భీమిలి, మంగళగిరిలో 90 వేల మెజారిటీలు దాటాయన్నారు.

పాలకులు కాదు సేవకులం

తాము పాలకులం అని కాకుండా సేవకులం అనే నినాదానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. సూపర్ 6, ప్రజాగళం మేనిఫెస్టో అంశాలు ప్రజల్లోకి బాగా వెళ్లాయని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చి కూటమికి బీజం వేసినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. అసెంబ్లీలో తనను, తన కుటుంబ సభ్యులను అవమానించారని, కౌరవసభలో ఉండబోనని నాడు చెప్పానన్నారు. గౌరవ సభగా మార్చిన తర్వాతే మళ్లీ సభకు వస్తానని చెప్పానని, తన ప్రతిజ్ఞను ప్రజలు నిజం చేశారని తెలిపారు. తాము జాతీయ స్థాయిలో ఎన్డీయేతోనే ఉన్నామని, ఉంటామన్నారు. ఏమైనా మార్పు ఉంటే చెబుతానన్నారు.

తెలంగాణ గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో బుధవారం ఎన్డీఏ పక్ష నేతల సమావేశం సందర్భంగా తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణను శబరి బ్లాక్‌లో కలుసుకున్న టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కొద్దిసేపు చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ పదేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో విభజనకు సంబంధించి పలు పెండింగ్ అంశాలను ఆయన గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు సమాచారం. ఎన్డీఏ పక్ష నేతల సమావేశం అనంతరం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కూడా ఆయన నివాసంలో చంద్రబాబు కలిశారు. ఎన్డీఏ పక్ష భేటీలో ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ చంద్రబాబు లేఖను అందజేశారు. తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని మోదీని ఈ సందర్భంగా చంద్రబాబు ఆహ్వానించినట్లు తెలిసింది. టీడీపీ మద్దతు కీలకంగా మారిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో ఆరు మంత్రి పదవులతోపాటు స్పీకర్ పదవిని కూడా చంద్రబాబు కోరినట్లు జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. అనంతరం విజయవాడ వెళ్లేందుకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబు అక్కడ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో కొద్దిసేపు సమావేశమయ్యారు.

12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం!

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జూన్ 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. తొలుత 9వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని భావించినా ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారోత్సవం నేపథ్యంలో ముహూర్తాన్ని మార్చినట్టు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. రాజధాని అమరావతి ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది.

మంత్రుల రేసులో..

ఆశావహుల జాబితాపై చంద్రబాబు ప్రాథమిక కసరత్తు
పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవిపై అస్పష్టత
విపక్షంగా సభలో అడుగు పెట్టి ప్రభుత్వంలో చేరతామంటున్న జనసేన అధ్యక్షుడు
ఒకేసారి రెండు పాత్రలు పోషించడం సాంకేతికంగా ఎలా సాధ్యం?



సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు దక్కుతుందనే అంశంపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కూటమి నుంచి 164 మంది ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో మంత్రి పదవులకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే కొందరికి మంత్రి పదవులు ఇస్తామని హామీ ఇవ్వడం, చాలామంది సీనియర్లు గెలుపొందడం, బీజేపీ, జనసేనకు అవకాశం ఇవ్వాల్సినందున మంత్రివర్గ కూర్పు కత్తిమీద సాములా మారనుంది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కి ఉప ముఖ్యమంత్రి పదవి లభిస్తుందని ఎన్నికలకు ముందు నుంచే ప్రచారం సాగుతుండగా బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ప్రధాన ప్రతిపక్షంగా అసెంబ్లీలోకి అడుగుపెట్టబోతున్నట్లు ఆయన ప్రకటించడం గమనార్హం. మరోవైపు ప్రభుత్వంలోనూ భాగస్వాములుగా ఉంటామని చెప్పుకొచ్చారు. అయితే ఈ రెండు ఎలా సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉండాలని నిర్ణయించుకుంటే మంత్రివర్గంలో జనసేన చేరడం కుదరదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ పవన్ కల్యాణ్ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ తన పార్టీకి చెందిన వారికి మంత్రి పదవులు ఇప్పించాలనుకున్నా సాంకేతికంగా అది సాధ్యం కాదనే వాదన వినిపిస్తోంది. దీంతో ఎలా ముందుకు వెళతారనే అంశం ఆసక్తికరంగా మారింది. జనసేన మంత్రివర్గంలో చేరితే నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్‌కు అవకాశం ఉంటుందని భావి స్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉండాలనే విషయంపై వెనక్కి తగ్గితే పవన్ కళ్యాణ్ ఉప ముఖ్య మంత్రి పదవి తీసుకునే అవకాశం ఉంది. ఇక బీజేపీ నుంచి అసెంబ్లీకి గెలిచిన వారిలో చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. సత్యకుమార్, విష్ణుకుమార్‌రాజుకు కూడా అవకాశం దక్కవచ్చని చెబుతున్నారు.

పాతవారికే పెద్దపీట

టీడీపీలో మంత్రి పదవుల ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. 135మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీ నుంచి గెలుపొందడంతో ఎవరికి అవకాశం దక్కుతుందోననే చర్చ జరుగుతోంది. సామాజిక సమీకరణలు, సీనియారిటీ ప్రాతిపదికన పలువురు నేతలు తమకు మంత్రివర్గంలో చోటు దక్కుతుందని గట్టిగా నమ్ముతున్నారు. చంద్రబాబు ఇప్పటికే దీనిపై ప్రాథమికంగా కొంత కసరత్తు చేసినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. నారా లోకేష్, పొంగూరు నారాయణ, అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, ధూళిపాళ్ల నరేంద్రకు కచ్చితంగా మంత్రివర్గంలో స్థానం లభిస్తుందని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలవారీగా ఆశావహుల జాబితా

శ్రీకాకుళం: కింజరపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, బెందాళం అశోక్
విజయనగరం: కళా వెంకట్రావు, అదితి గజపతిరాజు
విశాఖపట్నం: గంటా శ్రీనివాసరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత
తూర్పు గోదావరి: జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్యచౌదరి
పశ్చిమ గోదావరి: నిమ్మల రామానాయుడు, చింతమనేని ప్రభాకర్, పితాని సత్యనారాయణ, కనుమూరి రఘురామకృష్ణరాజు
కృష్ణా: కొల్లు రవీంద్ర, బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, కేపీ సారథి
గుంటూరు: నారా లోకేష్, ధూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు
ప్రకాశం: దామచర్ల జనార్దన్, గొట్టిపాటి రవికుమార్
నెల్లూరు: పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
కర్నూలు: కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, ఎన్ఎండీ ఫరూఖ్
అనంతపురం: పయ్యావుల కేశవ్, పరిటాల సునీత, కాల్వ శ్రీనివాసులు
చిత్తూరు: పులివర్తి నాని, అమర్‌నాథ్‌రెడ్డి, బొజ్జల సుధీర్
కడప: రెడ్డప్పగారి మాధవి, వరదరాజులరెడ్డి

నా నడక జగన్‌తోనే

- పేదలకు ఎంతో మేలుచేసిన వైఎస్ జగన్‌ను ప్రజలు ఓడించడం బాధగా ఉంది
- సవాల్ మేరకు నా పేరును మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్నా
- కాపు ఉద్యమ నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం



కిర్లంపూడి: 'కోట్లాది రూపాయలు అందజేసి పేద వారికి ఆక్సిజన్ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఓడించడం బాధగా ఉంది. నా నడక వైఎస్ జగన్‌తోనే. ఆయన వెనకాలే నేను నడుస్తా' అని కాపు ఉద్యమ నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం చెప్పారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ ఎన్నికల్లో జగన్‌కు ఓటమి రావడం చాలా బాధాకరం. పేదలకు కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలు అందజేశారు. అయినా ఆయనను ఓడించడం బాధగా ఉంది. దేశంలో ఏ ముఖ్యమంత్రీ కూడా ఈ స్థాయిలో సంక్షేమ పథకాల అమలుకు సాహసం చేయలేదు. కానీ, ప్రజలు ఎందుకు ఓడించారనేదే నా ప్రశ్న? సంక్షేమం కన్నా అభివృద్ధి మీద ఆసక్తి చూపించారా? లేకపోతే ఎదుటి పార్టీ వాళ్ల ప్రకటించిన సంక్షేమ పథకాలకు మొగ్గు చూపారా? రాబోయే ఏ ముఖ్యమంత్రి కూడా సంక్షేమ పథకాల జోలికి వెళ్లకుండా ప్రజలు ఇలా చేశారనుకుంటున్నా. ప్రజల కోసమే నిరంతరం కష్టపడిన జగన్ మోహన్‌రెడ్డిని గౌరవించుకోలేకపోవడం బాధగా ఉంది. పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను ఓడించకపోతే నా పేరు పద్మనాభంరెడ్డిగా మార్చుకుంటానని గతంలో సవాల్ చేశా. ఆ మాటకు కట్టుబడి పేరు మార్పు కోసం దరఖాస్తు చేస్తున్నా. గెజిట్ పబ్లికేషన్‌లో మార్పుతో కూడిన పేరు చేర్చిన తర్వాత మీడియా సమావేశం పెట్టి ప్రకటిస్తా. నేను మాట్లాడితే చాలు.. ఉప్మా పద్మనాభం అంటూ అవమానించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. మా ఇంటికి వచ్చిన వారికి ఉప్మా, కాఫీ ఇవ్వడం మీకు చీప్‌గా ఉందా? మా తాత, తండ్రి నుంచి కూడా మా ఇంటికి ఎవరు వచ్చినా మర్యాద చేయడం అలవాటు. అదేదో నేరమన్నట్లు మీరంతా భూతద్దంలో చూపిస్తున్నారు. మీ ఇళ్లకు ఎవరైనా వస్తే వారికి మర్యాద చేయరా?' అని ముద్రగడ ప్రశ్నించారు. ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి నేతలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లా వార్తలు

పెద్దమ్మతల్లి గుడిలో రుద్రహోమం



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రహోమం, అమ్మవారికి సువర్ణ పుష్పార్చన శాస్త్రోక్తంగా చేశారు. తొలుత స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చి పూజల అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంటెలిజెన్స్ ఏఎస్పీ యు.వెంకన్నబాబు, క్రైమ్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఏఎస్పీ జి.మల్లయ్యస్వామి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అంబులెన్స్‌లను తనిఖీ చేసిన ప్రోగ్రాం ఆఫీసర్



తనిఖీ చేస్తున్న ప్రోగ్రామ్ అధికారి నాగేందర్

ఇల్లెందు: క్షతగాత్రులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని ఆస్పత్రులకు చేర్చే 108 అంబులెన్స్‌లను ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ భూమా నాగేందర్ బుధవారం తనిఖీ చేశారు. ఇల్లెందు, టేకులపల్లిలోని 108, 102 అంబులెన్స్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి వాహనాల్లో పరికరాలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి జీపీఎస్ ట్యాబ్ మీద అవగాహన కల్పించారు. అత్యవసర స్థితిలో ఉన్న వారిని కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉన్నందున వాహనాల కండీషన్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈఎంటీ పూర్ణచందర్, పైలట్ వేణు, కెప్టెన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'కాలం' ముంచుకొచ్చింది..



తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు



కుదునూరు సమీపాన గండి పడిన చోట వేసిన ఇసుక బస్తాలు



తూతూమంత్రంగా చేపట్టిన డిస్ట్రిబ్యూటరీ కాల్వ పనులు

- అయినా మొదలుకాని తాలిపేరు కాల్వల మరమ్మతులు
- ఎన్నికల కోడ్ కారణమంటున్న అధికారులు
- సాగు పనులు ప్రారంభం కాకముందే పూర్తి చేయాలని అన్నదాతల విజ్ఞప్తి

చర్ల: ఖరీఫ్ సీజన్ వచ్చేసినప్పటికీ చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు కాల్వల మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగు సవ్యంగా సాగుతుందా? అని రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ప్రాజెక్టు కింద అధికారికంగా 24,700 ఎకరాలు, అనధికారికంగా 15 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అయితే, గత రబీలో సాగు నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేసిన అధికారులు ప్రాజెక్టు, కాలువల మరమ్మతులు చేపడుతామని ప్రకటించారు. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా ఖరీఫ్ ముంచుకొచ్చినా దృష్టి సారించకపోవడం గమనార్హం. అయితే, తొలుత నిధులు లేవని, ఆపై ఎన్నికల కోడ్ అమల్లో ఉందని పనులు మొదలుపెట్టలేదు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇక ఇప్పుడు మరమ్మతు పనులు మొదలుపెట్టినా పదిహేను రోజుల్లో పూర్తికావడం కష్టమేనని.. ఫలితంగా చివరి ఆయకట్టుకు ఈ ఏడాది కూడా నీరందడం సాధ్యం కాదని రైతుల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చేయాల్సిన పనులు ఇలా..

తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ కింద ఎనిమిది డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు, ఎడమ ప్రధాన కాల్వ క్రింద 34 డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు ఉన్నాయి. కుడి, ఎడమ ప్రధాన కాల్వలతో పాటు రెండు వైపులా ఉన్న డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు పలు చోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. కాల్వలకు గండ్లు పడటం, పిచ్చిచెట్లు పెరిగి నీరు సాఫీగా సాగడం లేదు. ఇక డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు సంబంధించి ఉన్న రెగ్యులేటరీలు తుప్పుపట్టడమే కాక గేట్లు సైతం మొరాయిస్తున్నాయి. ఎడమ ప్రధాన కాల్వ వైపున కుదునూరు – దేవరాపల్లి మధ్య గత ఖరీఫ్ సీజన్‌లో గండి పడితే ఇసుక బస్తాలతో పూడ్చివేశారు. అంతేకాక కుడి, ఎడమ ప్రధాన కాల్వల గట్లు పలుచోట్ల బలహీనంగా మారాయి. దీంతో ఎగువన భారీగా వర్షాలు కురిస్తే వచ్చే వరదతో గండ్లు పడే ప్రమాదముంది. అయినప్పటికీ అధికారులు మరమ్మతులపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.


ఉపాధి హామీ నిధులతో అరకొరగా

చర్ల మండలంలో ఉన్న డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద మంజూరైన నిధులతో చేపడుతున్న మరమ్మతులు అరకొరగానే కొనసాగుతున్నాయి. కూలీలకు పరిజ్ఞానం లేక పూర్తిస్థాయిలో పనులు చేయకపోవడంతో సాగు నీటి ప్రవాహం కష్టంగానే కనిపిస్తోంది. అలాకాకుండా పనులు చేపడుతున్నప్పుడు ఇరిగేషన్ ఉద్యోగులు పర్యవేక్షిస్తే కాస్తయినా మేలు జరిగేదని చెబుతున్నారు.

ఎన్నికల కోడ్ కారణమా?

తాలిపేరు కాల్వల మరమ్మతులకు తొలుత నిధులు విడుదల కాలేదు. ఆపై అసెంబ్లీ, అనంతరం పార్లమెంట్ ఎన్నికలు రావడంతో కోడ్ అడ్డుపడింది. దీంతో పనుల్లో ఎడతెగని జాప్యం జరిగినట్లయింది. అత్యవసర పనులైనందున అనుమతించాలని ఇరిగేషన్ శాఖాధికారులు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినా స్పందన రాలేదని సమాచారం. అయితే వారం కిందట కాల్వలకు సంబంధించి అత్యవసర పనులు మొదలుపెట్టినట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నా ఖరీఫ్ ఆరంభం నాటికి పూర్తి కావడం కష్టమేనని తెలుస్తోంది.

త్వరగా పూర్తయ్యేలా చూడాలి..



ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వలతో పాటు అనుబంధంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల మరమ్మతులు త్వరగా చేపట్టి పూర్తిచేయాలి. మరో వారం, పది రోజుల్లో వర్షాలు ఊపందుకుంటాయి. ఆలోగా పనులు చేస్తేనే రైతులకు ఉపయోగంగా ఉంటుంది. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

–కూపాటి వీర్రాజు, రైతు, ఆర్.కొత్తగూడెం

ఇబ్బంది లేకుండా పనులు చేపడుతాం..

ఎన్నికల కోడ్‌తో నిధుల విడుదలలో జాప్యం జరిగింది. ఫలితంగా పనులు చేపట్టడం కూడా ఆలస్యమైంది. అయినప్పటికీ ప్రస్తుతం కాల్వల మరమ్మతులకు సంబంధించి వారం కిందట పనులు మొదలుపెట్టాం. ఖరీఫ్‌కు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పనులు చేపడుతూ త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. – **తిరుపతి, డీఈ, తాలిపేరు ప్రాజెక్టు**

ఈనెల 23న ఇఫ్టూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్

ఇల్లెందు: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 23న ఇల్లెందులో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ తెలిపారు. ఇల్లెందులో బుధవారం జరిగిన సమావేశంలో తేదీ ఖరారు చేసినట్లు ఆయన వెల్లడించారు. గత మహాసభల నుంచి జరిగిన కార్యక్రమాలను సమీక్షించుకుని నూతన పోరాట కార్యక్రమాల రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కె.విశ్వనాథ్, మదార్, వరదయ్య, రాంసింగ్, మూతి రాంబాబు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ నెల 9న ఇల్లెందులోని ఎల్లన్నభవన్‌లో ఇఫ్టూ ఇల్లెందు ఏరియా మహాసభ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు యాకూబ్‌షావలి ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు మంత్రి తుమ్మల విందు



మంత్రి తుమ్మలతో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, నాయకులు

సత్తుపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం నేపథ్యాన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి మండలం పాకలగూడెంలోని తన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఎమ్మెల్యేలకు విందు ఏర్పాటు చేశారు. మహబూబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన మంత్రి తుమ్మల ఇచ్చిన విందులో ఎంపీగా గెలిచిన పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, జాటోతు రామచంద్రనాయక్, మాలోతు రాందాసునాయక్, భూక్యా మురళీనాయక్, పాయం వెంకటేశ్వర్లు సహా ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఖమ్మం ఎంపీగా గెలిచిన రఘురాంరెడ్డి తండ్రి, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కూడా హాజరుకాగా ఆయనను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు మట్టా దయానంద్, నూకల నరేశ్‌రెడ్డి, తుమ్మల యుగంధర్, నున్నా రామకృష్ణ, చల్లగుళ్ల నర్సింహారావు, సాధు రమేశ్‌రెడ్డి, జెన్నారెడ్డి భరత్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిప్రదేశాల్లో అందరూ సమానమే

- సింగరేణి సీఎండీ బలరామ్
- పీవీకే-5 ఇంక్‌లైన్‌లో మ్యాన్ రైడింగ్ ప్రారంభం



మ్యాన్ రైడింగ్ ప్రారంభిస్తున్న సీఎండీ బలరామ్, పక్కన డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం): గనితో సహా అన్ని ప్రదేశాల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మికులంతా సమానమేనని ఎవరు కూడా కిందిస్థాయి సిబ్బందిని కించపరిచేలా వ్యవహరించొద్దని సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్ సూచించారు. కొత్తగూడెం ఏరియా పరిధి పీవీకే-5 ఇంక్‌లైన్ గనిలో రూ.9.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన మ్యాన్ రైడింగ్, జీకేఓసీ డంప్‌యార్డ్‌పై రూ.2.5 కోట్లతో ఏర్పాటు చేసిన ఎకో పార్క్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మ్యాన్ రైడింగ్ నిర్మాణంలో పాలుపంచుకున్న కార్మికులను అభినందించిన సీఎండీ మాట్లాడుతూ.. గనిలో దూరభారం తగ్గించేందుకు మ్యాన్ రైడింగ్ ఏర్పాటు చేశామన్నారు. కార్మికుల సహకారంతో 2023–24 ఆర్థిక సంవత్సరం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించగా, ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల సాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, ఎం.సత్యనారాయణరావు, ఏరియా జీఎం ఎం.శాలేంరాజు, ఉద్యోగులు, సంఘాల నాయకులు రవీందర్, శ్రీరమేశ్, పాలడుగు శ్రీనివాస్, వంగల శ్రీనివాసరావు, ఎండీ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో అద్దె వాహనాల డ్రైవర్ల సమ్మె

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో గత ఏడాది వరకు భూనిర్వాసితులు అద్దెకు సమకూర్చిన వాహనాల డ్రైవర్లు బుధవారం సమ్మెకు దిగారు. సుమారు తొమ్మిది నెలల పాటు తమ నుంచి రికవరీ చేసిన సీఎంపీఎఫ్ సొమ్ము చెల్లించాలనే డిమాండ్‌తో సమ్మె చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా అద్దె వాహనాల డ్రైవర్లు మాట్లాడుతూ 24 గంటలు నడిచే వాహనాలకు నెలనెలా రూ.20వేలు, 12 గంటలు నడిచే వాహనాలకు రూ.11 వేల చొప్పున రికవరీ చేయగా.. వాటి కాలపరిమితి తీరడంతో సీఎంపీఎఫ్‌ను పక్కన పెట్టారని పేర్కొన్నారు. ఇకనైనా నగదును తిరిగి తమకు చెల్లించడంతో పాటు నాలుగేళ్ల అగ్రిమెంట్‌తో కొనసాగుతున్న వాహనాల గడువు మరో ఏడాది పొడిగించాలని కోరారు. ఈ విషయాన్ని తాము గతంలో పలుమార్లు సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో యాజమాన్యం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఇందులో భాగంగా గురువారం కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.